ప్రజాశక్తి

మంగళవారం 19 మార్చి 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

మొదటి రోజు విశాఖలో 28,673 మంది, అనకాపల్లి జిల్లాలో 21,657 మంది హాజరు



పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఆరిలోవ : పదోతరగతి పబ్లిక్ పరీక్షలు మొదటి రోజు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. మొదటి రోజు జరిగిన ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షకు 29,040 మంది హాజరుకావాల్సి ఉండగా 28,673 మంది హాజరయ్యారని, 367 మంది గైర్హాజరయ్యారని ప్రకటించారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదన్నారు. జిల్లా అబ్జర్వర్, ప్రాంతీయ పాఠశాల సంయుక్త సంచాలకులు బి.విజయ భాస్కర్ రెండు పరీక్షా కేంద్రాలను, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున ఒక కేంద్రాన్ని, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ 4 కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 5 కేంద్రాలను సందర్శించారు.

ఓపెన్ స్కూలు పది, ఇంటర్ పరీక్షలు

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు సోమవారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. పదోతరగతి మొదటి పరీక్షకు 909 మంది విద్యార్థులకు గాను 832 మంది హాజరయ్యారని, 77 మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఓపెన్ స్కూలు ఇంటర్ పరీక్షకు 1062 మంది విద్యార్థులకు గాను 977 మంది హాజరు కాగా 85 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

విశాఖ కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్ జంక్షన్‌లో ఉన్న శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున తనిఖీచేశారు. అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పరీక్షలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ, ఇతర అధికారులు ఆయనతో పాటు ఉన్నారు.

పటిష్ట బందోబస్తు

పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్లు టూ టౌన్ సిఐ బి.తిరుమలరావు తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో భద్రతను ఆయన సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. పరీక్షల్లో అక్రమాలు, అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలు గుంపులుగా ఉండకూడదని చెప్పారు. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులతో పాటు, ఇన్విజిలేటర్లు, ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్లను అనుమతిస్తామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఏమైనా ఘటనలు చోటు చేసుకుంటే డయల్ 100కు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

అనకాపల్లి జిల్లాలో 99 శాతం హాజరు

అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో తెలుగు1 పరీక్షకు సుమారు 99 శాతం మంది హాజరైనట్టు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టితో కలిసి పలు కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు వన్ పరీక్షకు రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 21,801 మంది హాజరు కావలసి ఉండగా, 21,657 మంది హాజరైనట్లు, 144 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. 28 పరీక్ష కేంద్రాలను తనతో పాటు స్క్వాడ్ బృందాలతో కలిసి తనిఖీ చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు కావలసిన వైద్య, మంచినీటి సదుపాయం, పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణకు పటిష్ట చర్యలు

విశాఖ కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని, ప్రతి అంశంపైనా సంపూర్ణ అవగాహన కల్పించుకొని విధులు సక్రమంగా నిర్వర్తించాలని సంబంధిత అధికారులను విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ నిమిత్తం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన వివిధ మానిటరింగ్ కేంద్రాలను సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో నిర్వర్తించాల్సిన బాధ్యతలు, ఇతర నిబంధనలను విధులు నిర్వర్తించే ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఆదేశించారు. తగినంత మంది సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూమ్, వెబ్ కాస్టింగ్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం 104 కాల్ సెంటర్ రూములో ఏర్పాటుచేసిన 24 7 పని చేసే కాల్ సెంటర్‌ను పరిశీలించి తగిన సూచనలు చేశారు. అనంతరం ఎంసిఎంసి. (మీడియా సర్టిఫికేషన్, మానటరింగ్ సెల్), కంప్లైంట్ నమోదు కేంద్రాన్ని సందర్శించారు. తర్వాత కింద అంతస్తులో ఏర్పాటు చేసిన సింగిల్ విండో కేంద్రం, బడ్జెట్ ఎక్స్‌పెండేచర్ కేంద్రం, మీడియా, సోషల్ మీడియా కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి కేంద్రంలో ఉండే సిబ్బందికి వారి విధులు, ఎన్నికల ప్రక్రియ గురించి అవగాహన కల్పించాలని, వీలుంటే శిక్షణ అందించాలని ఎన్నికల సెల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట కలెక్టరేట్ ఎఒ బిఎస్.దేవ్ ప్రసాద్, నోడల్ అధికారులు, ఎన్నికల సెల్ అధికారులు ఉన్నారు.

సాధారణ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎన్నికల కోడ్ ముగిసే వరకు సేవలు అందుతాయని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున తెలిపారు. ఈ మేరకు ఐదు హంటింగ్ లైన్స్‌తో కూడిన 0891-2590100 ఫోన్ నెంబర్ నిత్యం అందుబాటులో ఉంటుందని, సాధారణ ప్రజలు, అభ్యర్థులు, ఇతర వ్యక్తులు నుంచి ఫోన్ల ద్వారా ఫిర్యాదులు స్వీకరించి నివేదిస్తారని అన్నారు. వాటిని పరిశీలించి సంబంధిత అధికారుల ద్వారా తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

నూతన డిఐపిఆర్‌ఒగా ఎస్‌వి.రమణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : విశాఖపట్టణం జిల్లా నూతన డిఐపిఆర్‌ఒగా ఎస్‌వి.రమణ సోమవారం సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్‌వి.రమణ ఇప్పటి వరకు విజయనగరం జిల్లా సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్‌గా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు విశాఖలో పనిచేసిన వి.మణిరామ్ విశాఖపట్టణం ఆర్‌జెడి (ప్రాంతీయ సంయుక్త సంచాలకులు)గా వెళ్లారు.

అదాని గంగవరం పోర్టు కాలుష్యాన్ని అరికట్టాలని ధర్నా

▶ వార్త మెయిన్‌లో..

తూర్పు నావికాదళంలో టైగర్ ట్రయంఫ్ విన్యాసాలు

▶ వార్త 8లో..

దిబ్రూగఢ్-కన్యాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ సేవలు పెంపు

▶ వార్త 8లో..

ఎన్నికల కోడ్ అమలులో నిర్లక్ష్యం

▶ వార్త 3లో..



నిరసన తెలుపుతున్న ఉబర్ డ్రైవర్లు

ఉబర్ డ్రైవర్ల సమ్మె

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన విశాఖపట్నంలో ఉబర్ డ్రైవర్లు సోమవారం నుంచి సమ్మెలోకి దిగారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు బి.జగన్, అధ్యక్షుడు సిహెచ్ శ్రీనివాసులు, కె.పోలినాయుడు, ఆనంద్, అబ్బాయి, మనోహర్, రామ్మోహన్, సిమ్మ శ్రీను, నాయుడు ఈ సమ్మెకు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సిహెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ, గతంలో ఇచ్చిన రేట్లు తగ్గించకూడదని, చట్ట ప్రకారం కంటే అదనంగా కమిషన్ తీసుకోవడం అపాలని, ఉబర్‌లో ఫ్లాట్ ఫామ్ ఫీస్ 39 తీసివేయాలని, ఉబర్‌లో తగ్గించిన రేట్లు పెంచాలని, వే బిల్ చూపించాలని, నెగిటివ్ బ్యాలెన్స్ రూ.1000కు మించి ఉండాలని, బుకింగ్ యాప్‌లో ఎస్‌యువి పెట్టాలని, నైట్ ఫెయిర్స్ రాత్రి 10 గంటలు నుంచి ఉదయం 6 గంటల వరకు 50 శాతం ఇవ్వాలని, ఉబర్ ఇంటర్సిటీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ, డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను ఉబర్ యాజమాన్యం పరిష్కరించేవరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

వెనుకబడిన జిల్లాల ప్యాకేజీ పునరుద్ధరించాలి

- అభివృద్ధిలో స్థానికులను భాగస్వామ్యం చేయాలి
- ఆచార్య కెఎస్.చలం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : 2014 చట్టం ద్వారా విడివడిన ఆంధ్రప్రదేశ్‌లో చట్టంలోని 46(3) ప్రకారం ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం విశాఖపట్నం పాత జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ అమలు కాలేదని, వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక ప్యాకేజీ పునరుద్ధరించాలని యుపిఎస్‌సి మాజీ చైర్మన్ ఆచార్య కెఎస్.చలం డిమాండ్ చేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక ఆధ్వర్యాన సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం జిల్లాలను పునర్వ్యవస్థీకరించడంతో ఉత్తరాంధ్ర 6 జిల్లాలుగా రూపొంది గోదావరి వరకు సాగిందన్నారు. ఇవి ఆదివాసి, తీర, మైదాన ప్రాంతాలుగా ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు మూడింట ఒక వంతు ఆదాయాన్ని విశాఖపట్నమే సమకూరుస్తున్నా ఇక్కడి ప్రజల జీవితాల్లో మార్పులేదన్నారు. దళిత, ఆదివాసి, వెనుక బడిన జనాభా 90 శాతంగా ఉందని వివరించారు. ఈ ప్రాంతంలో దోపిడీ పెరగటంతో మిగతా ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి పలు అంశాలను ప్రభుత్వం, రాజకీయపార్టీల దృష్టికి తెస్తున్నామన్నారు. విశాఖలోని వనరులను స్థానికేతరులు కొల్లగొట్టి స్థానిక ప్రజలను, వారి సంస్కృతిని పక్కకు నెట్టేశారని ఆవేదన వెలిబుచ్చారు. విశాఖపట్నం అభివృద్ధికి వెచ్చించే రూ.కోట్లు స్థానికులకు లబ్ధి చేకూర్చకుంటే ఎందుకూ ఉపయోగం ఉండదన్నారు. విశాఖ వచ్చే టూరిస్టుల కోసమే సౌకర్యాలు ఉన్నాయన్నారు. స్థానిక ప్రజలకు 29 అంశాల్లో సేవలందివ్వాల్సిన కార్పొరేషన్ వనరులు వేరేగా దారి మళ్లుతున్నాయని విమర్శించారు. విఎంఆర్‌డిఎ ప్రణాళిక పౌరుల అవసరాలకు కాకుండా రియల్ ఎస్టేట్‌కు ఉపయోగ పడేలా ఉందని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు తెలుగు జాతి హక్కు అని, ఉత్తరాంధ్ర జీవనాధారం అని, ఈ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య కెఎస్.చలం

మిగతా 2లో..

ఆటోనగర్ కార్మికులకు న్యాయం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రకరకాల స్క్రాప్ వృత్తులు చేసుకుంటున్న ఆటోనగర్ కార్మికులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు ప్రభుత్వానికి హెచ్చరించారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరాన్ని సుందరీకరణ చేసే ఉద్దేశంతో నగరంలోని స్క్రాప్ వర్కర్లందరినీ నగర శివారుకు పంపించేందుకు గత ప్రభుత్వం 2019లో కణమాం గ్రామం వద్ద 157.7 ఎకరాల స్థలం ఆటోనగర్ కోసం కేటాయించిందని తెలిపారు. కొత్త ప్రభుత్వం వచ్చాక రాజన్న ఆటోనగర్‌గా నామకరణం చేసి స్క్రాప్ వర్కర్లకు ఇవ్వటానికి నిర్ణయించిందని తెలిపారు. ఐదేళ్ల గడిచినా నిర్మాణ దాఖలాలు కనిపించలేదన్నారు. రాజన్నపైన గౌరవం కొద్ది పేరు మార్చారా, లేదా అక్కడున్న భూములు తీసుకోవటానికి పేరు మార్చారా అనేది నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులకు దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ హామీ ఇచ్చినా నిర్మాణం చేపట్టలేదన్నారు. వెంటనే నిర్మించి ఇవ్వకపోతే రాబోయే ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. సమావేశంలో కె.సంతోష్ కుమార్, ఆటోనగర్ కార్మిక సంఘం నాయకులు గణేష్, సమీర్, సిఐటియు నాయకులు కెవిపి.చంద్రమౌళి, కె.నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు వై.రాజు

మొదటి పేజీ తరువాయి..

వెనుకబడిన జిల్లాల ప్యాకేజీ పునరుద్ధరించాలి

ప్రాంత ప్రజల సెంటిమెంట్ అయిన ఆ కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. గోదావరి నది నీటిలో ఉత్తరాంధ్రకు హక్కు ఉందని, ఆ నీటిని సాగుకోసం ఉత్తరాంధ్రకు మళ్లించాలని కోరారు. పురుషోత్తంపట్నం ప్రాజెక్ట్ ఏమైందని ప్రశ్నించారు.

రైల్వే జోన్ వచ్చేంత వరకూ ఇక్కడ ఉన్న డివిజన్‌ను అప్ గ్రేడ్ చేసి నియామకాలకు అవకాశం కల్పిస్తే స్థానికులకు ఉద్యోగాలు వస్తాయన్నారు. ఉత్తరాంధ్ర బంగాళాఖాతంలో మత్స్యసంపద మాయమైందని, మత్స్యకారుల వలసలు పెరిగాయని తెలిపారు. మెకనైజేషన్ ఆపాలన్నారు.

విశాఖ నగరం చుట్టూ ఉన్న ప్రకృతి తూర్పు తీరంలోనే గొప్పదని, ఇక్కడ ఉండే కొండలు, ఎర్రమట్టి దిబ్బలు, బౌద్ధ చారిత్రక ప్రదేశాలు చారిత్రాత్మక మయినవని, అవే విశాఖకు గుర్తింపు అని తెలిపారు. వాటిని కాపాడాలని కోరారు. సిఆర్‌జెడ్ నిబంధనలు పాటించాలని సూచించారు. అన్ని పార్టీలలో స్థానికులకు అవకాశాలివ్వాలని, డబ్బు సంచులతో దిగుమతి అయ్యే వారిని ఆపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఉత్తరాంధ్ర రక్షణ వేదిక అధ్యక్షులు ఎస్ఎస్.శివశంకర్, జర్నలిస్టు సత్యనారాయణ, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, సూర్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొప్పలవెలమ సంఘం నాయకులు

'అనకాపల్లి, విజయనగరం పార్లమెంట్ స్థానాలు కొప్పల వెలమలకు కేటాయించాలి'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అనకాపల్లి, విజయనగరం పార్లమెంట్ స్థానాలు కొప్పల వెలమలకు కేటాయించాలని కొప్పులవెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిలపర్తి పరదేశినాయుడు అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 28 లక్షల కొప్పులవెలమ కులస్తులు ఉన్నారని, ఉత్తరాంధ్ర జిల్లాలోనే సుమారు 20 లక్షలకుపైగా ఉన్నారని తెలిపారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలో, నర్సీపట్నం, పాయకరావుపేట, ఎలమంచిలి, పెందుర్తి చోడవరం, మాడుగుల నియోజవర్గాల్లో అత్యధిక కొప్పులవెలమ సామాజిక వర్గం ఉందని, రాష్ట్ర బిసి కులాల్లో రెండవ అతిపెద్ద కులమని చెప్పారు. గతంలో అనకాపల్లి పార్లమెంట్ స్థానంలో చింతకాయల అయ్యన్నపాత్రుడు, సబ్బం హరి ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. విజయనగరంలో ప్రతిపక్ష కూటమి కొప్పులవెలమకే టికెట్ ఇవ్వాలని కోరారు. ఏ రాజకీయ పక్షాలు తమవారికి టికెట్ ఇస్తారో వారిని గెలిపిస్తామన్నారు. సమావేశంలో కొప్పుల వెలమ సంఘం నాయకులు బొత్స వరప్రసాద్, శీర సత్యనారాయణ, నాయకులు దొగ్గ దేముడు, గుణుపూరు రామారావు, మేళాపు శ్రీహరి నాయుడు పాల్గొన్నారు.

'దక్షిణం'లో స్థానికులకే అవకాశమివ్వాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో జనసేన గెలుపే ధ్యేయంగా స్థానిక నాయకులకు అవకాశం ఇవ్వాలని 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్, జనసేన నాయకుడు మూగి శ్రీనివాసరావు కోరారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, పార్టీ అధినేత నిర్ణయం శిరోధార్యమని, ప్రజల మనోభావాలు పరిగణలోకి తీసుకుని అభ్యర్థిని ప్రకటించాలని కోరారు. పక్క నియోజకవర్గంలో పనికిరాని వంశీకృష్ణ శ్రీనివాస్‌ను దక్షిణంలో రుద్దడం సరికాదని, పార్టీలో కష్టపడిన మత్స్యకారులు, మైనారిటీలకు టికెట్ఇస్తే బాగుంటుందని తెలిపారు. దక్షిణంలో వంశీకృష్ణ శ్రీనివాస్ పట్ల ప్రజలు సుముఖంగా లేరని తెలిపారు. గత 15 ఏళ్ళ గా ప్రజల్లో ఉన్న నాయకులకు టికెట్ ఇవ్వాలన్నారు. సమావేశంలో జనసేన నాయకులు మేడిశెట్టి రమణ, వెంకటరావు, దేముడు, రూప, తులసి, కనక మహాలక్ష్మి పాల్గొన్నారు.

22 నుంచి సంగీత శిక్షణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విమలకృష్ణ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యాన ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 22వ తేదీ వరకు జయదేవుని అష్టపదులు, సదాశివ బ్రహ్మేంద్ర కీర్తనలపై సంగీత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు అకాడమీ అధ్యక్షులు డాక్టర్ మండపాక శారద తెలిపారు. ఇసుకతోట కృష్ణ టెంపుల్ పక్కన విక మ్యూజిక్ అకాడమీలో ప్లాట్ నెంబర్ 101లో వారానికి 2 రోజులు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలవారు 21వ తేదీలోగా శ్రీవిద్య (7993045466), శ్రీలత (9000774695) సంప్రదించి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

అన్ని రంగాల అభివృద్ధే ధ్యేయం


ఖాతాదారులను సత్కరిస్తున్న బ్యాంకు ప్రతినిధులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అన్ని రంగాల వారి అభివృద్ధి, ఉత్తమ సేవలే ధ్యేయంగా తమ బ్యాంకు ఆవిర్భవించిందని కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు తెలిపారు. ఖాతాదారుల ఆదరణతో రానున్న కాలంలో బ్యాంకును మరింత అభివృద్ధి దిశలో తీసుకెళ్తామన్నారు. బ్యాంకు రజతోత్సవాల సందర్భంగా కంచరపాలెం, సీతమ్మధార బ్యాంకు శాఖల ఆవరణలో సోమవారం ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ, ఖాతాదారులకు తమ బ్యాంకు ద్వారా మరిన్ని సేవలను అందిస్తూ ఆదరణ పొందుతున్నామన్నారు. బ్యాంకు స్థాపించి 25వ ఏట అడుగిడిందని తెలిపారు. ఇప్పటి వరకు వివిధ జిల్లాల్లో 28 శాఖలను ఏర్పాటుచేసుకున్నామన్నారు. 1707 మంది సభ్యులతో రూ.38.38 లక్షల షేర్ ధనముతో కేవలం ఏడుగురు సిబ్బందితో ప్రారంభమైన బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం 17,350 మంది సభ్యులతో రూ.33 కోట్లు వాటా ధనము పొంది, రూ.1400 కోట్ల వ్యాపారంతో అర్బన్ కో-ఆపరేటివ్ రంగంలోనే ముందంజలో ఉందని వివరించారు. సాంకేతికపరంగా కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా కో-ఆపరేటివ్ రంగంలో ఖాతాదారులకు సేవలందిస్తున్నామన్నారు. బ్యాంకు వైస్‌ఛైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ సీతమ్మధారలో తమ బ్యాంకు ఏర్పాటైన నాటి నుంచి ఖాతాదారుల, శ్రేయోభిలాషుల సహకారంతో ముందుకు సాగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ ఖాతాదారులను బ్యాంకు ఛైర్మన్ సత్కరించి, మెమోంటోలను అందజేశారు. ఈ సమావేశంలో బ్యాంకు డైరెక్టరు బి.నాగేశ్వరరావు, ముఖ్యకార్యనిర్వహణాధికారి కె.శ్యామ్‌కిశోర్, ఒఎల్‌డి శాస్త్రి, సీతమ్మధార శాఖ మేనేజరు కె.విశ్వనాథం, కంచరపాలెం శాఖ మేనేజరు దిలీప్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బీచ్‌లో భారత్ నివేష్ రన్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇండియా (ఎఎంఎఫ్ఐ), సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) సంయుక్తంగా భారత్ నివేష్ రన్ మారథాన్‌ను ఆర్‌కె.బీచ్ రోడ్డులో సోమవారం నిర్వహించారు. భారత్ నివేష్ రన్‌ను సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.రామ్‌మోహన్‌రావు, ఎఎంఎఫ్ఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని, ఈస్టర్న్ నేవల్ కమాండ్ కమాండ్ రిఫిట్ ఆఫీసర్ కమాండర్ ఎస్.సబేశన్‌తో కలిసి ప్రారంభించారు. ఫైనాన్షియల్ ల్యాండ్‌స్కేప్‌లో పెట్టుబడిదారుల విద్య ప్రాముఖ్యత, ఆర్థిక అక్షరాస్యత, శారీరక దృఢత్వం గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ మారథాన్‌ను నిర్వహించారు. ఎఎంఎఫ్ఐ సిఇఒ వెంకట్ చలసాని వ్యక్తిగత, సామాజిక శ్రేయస్సును పెంపొందించడంలో పెట్టుబడిదారుల అవగాహనపై వివరించారు. ఈ మారథాన్‌లో సుమారు 4000 మంది పాల్గొన్నారు.



బీచ్ రోడ్డులో మారథాన్‌లో పాల్గొన్న ప్రజలు

'తూర్పు'లో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధి ఎంవిపి కాలనీ సెక్టార్ -4లో రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి పట్టాభి రామ్ ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబును, కూటమి ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెక్కంటి సత్తిబాబు, చినిపిల్లి నరేంద్ర, వాసు, గోవమ్మ, ఈశ్వరరావు, శాంతారావు, దేముడుబాబు, లక్ష్మి, కనక, మలిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన కంచర్ల, గంపల

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరానికి చెందిన డాక్టర్ కంచర్ల అచ్యుతరావు సోమవారం అమరావతిలో సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. డాక్టర్ కంచర్ల అచ్యుతరావు రియల్ ఎస్టేట్ వ్యాపారి. గతంలో ప్రజారాజ్యంలో క్రియాశీలకంగా పనిచేసి,కొన్నేళ్ళుగా తూర్పు నియోజకవర్గంలోను, ముఖ్యంగా ఆరిలోవ ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు

సీతమ్మధార: టిడిపి సీనియర్ నేత గంపల వెంకట రామచంద్రరావు, ఆయన సతీమణి సంధ్యా రాణి సోమవారం ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. టిడిపి విశాఖపట్నం సౌత్, ఈస్ట్ ఎలక్షన్ ఇంచార్జిగా పనిచేసిన రామచంద్రరావు, గతంలో ఎపిసిసి జాయింట్ సెక్రటరీగా, ఒబిసి వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. సెన్సార్ బోర్డు మెంబర్‌గా, పోర్ట్ ట్రస్ట్ డైరెక్టర్‌గా కూడా వ్యవహరించారు. కార్యక్రమంలో వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, వైజాగ్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గన్నమనేని వెంకటేశ్వరరావు ఉన్నారు.

బొత్స ఝాన్సీకి శుభాకాంక్షలు తెలిపిన బెహరా

ప్రజాశక్తి -గోపాలపట్నం : వైసిపి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని ఆమె నివాసంలో జివిఎంసి కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛమిచ్చి, సాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన గునిశెట్టి శ్రీనివాసరావును బొత్స ఝాన్సీ అభినందించారు. కార్యక్రమంలో 92 వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు, కంపర సత్తిబాబు, ఊటపల్లి గోవింద, ల్లవు సురేష్, గొంతిన జగదీష్ వైసిపి నేతలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలులో నిర్లక్ష్యం!

ప్రజాశక్తి -తగరపువలస: ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు చేయాలని ఎన్నికల సంఘం ఒకవైపు హుకుం జారీ చేస్తుంటే, క్షేత్రస్థాయిలో అమలులో వైఫల్యాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్ సరుకుల పంపిణీ చేసే వాహనంపై సిఎం జగన్‌మోహన్ రెడ్డి బొమ్మ ఇంకా అలాగే ఉంది.పలు వీధుల్లో ఈ తరహా వాహనాలు దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా? లేక పర్యవేక్షణా లోపమా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఎన్నికల నియమావళి అమలులో లోపాలను సరిదిద్దుకోవాలని, వివక్షకు తావులేకుండా ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఉద్దేశ్య పూర్వకంగా ఎన్నికల కోడ్ అమలులో నిర్లక్ష్యం చేస్తే వారే బాధ్యులౌతారన్న విషయాన్ని గుర్తించాలని పలువురు అంటున్నారు.



రేషన్ పంపిణీ వాహనంపై యథాతథంగా ప్రచార బోర్డులు

'ఉక్కు' పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

డిక్లరేషన్ సభ విజయంపై హర్షం : పాశర్ల ప్రసాద్

ప్రజాశక్తి -సీతమ్మధార : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటుపరం కాకుండా పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని కాంగ్రెస్ నేత పాశర్ల ప్రసాద్ అన్నారు. సోమవారం పౌరగ్రంథాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్ వేదికగా నిర్వహించిన డిక్లరేషన్ సభ విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సభలో కాంగ్రెస్ ముఖ్యనేతలు తమ వైఖరిని స్పష్టం చేశారన్నారు. ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని ఇప్పటికే స్పష్టం చేశారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రభుత్వరంగసంస్థల పరిరక్షణతోపాటు ఏపికి ప్రత్యేకహోదా వస్తుందన్నారు. హిందువులపై దాడులు జరిగినా పట్టించుకోని బిజెపి, హిందుత్వ ముసుగులో ఓట్లు దండుకుంటోందన్నారు. బాబు, జగన్, పవన్‌లు బిజెపి గూటి పక్షులేనన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, పాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు టిడిపిలో పనిచేసేవారికి గుర్తింపు లేదని ఆవేదన వెలిబుచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

గాయపడిన జూనియర్ లైన్‌మ్యాన్ మృతి



సయ్యద్ అలీ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి -సీతమ్మధార : విధి నిర్వహణలో విద్యుత్ షాక్‌కు గురై, తీవ్రగాయాలతో నాలుగు వారాల పాటు పినాకిల్ ఆసుపత్రిలో మృత్యువుతోపోరాడిన జూనియర్ లైన్‌మ్యాన్ సయ్యద్ అలీ (34)సోమవారం ప్రాణాలు విడిచారు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. జివిఎంసి 77వ వార్డు, పెదగంట్యాడ మండలం చిన్నపాలెం ముస్లిమాబాద్‌కు చెందిన సయ్యద్ అలీ ఎపిఇపిడిసిఎల్‌లో జూనియర్ లైన్‌మ్యాన్‌గా ఉద్యోగం చేస్తున్నారు. గత నెల 24న కంచరపాలెం జోన్2 సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతు పనుల్లో భాగంగా స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా, ఆకస్మాత్తుగా విద్యుత్ ఛార్జి కావడంతో షాక్‌కు గురై స్తంభంపై నుండి కింద పడిపోయారు.ఈ ఘటనలో తీవ్రగాయాలైన సయ్యద్ అలీని తోటి సిబ్బంది ఆరిలోవలో ఉన్న పినాకిల్ ఆసుపత్రిలో చేర్పించారు. నాలుగు వారాలుగా వెంటిలేటర్‌పై వైద్యులు చికిత్స అందించినప్పటికీ సయ్యద్ అలీ ఆరోగ్యం కుదుటపడలేదు. పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. సయ్యద్ అలీ మరణంతో కుటుంబసభ్యుల రోదనలు అందరినీ కలచివేశాయి. చిన్నపాలెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్: ఎస్.రాయవరం: మండలంలోని గెడ్డపాలెం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ విభీషణరావు తెలిపారు. తుని నుండి అనకాపల్లి వెళ్ళే మార్గంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి మార్చురీకి తరలించామన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లతో 'పది' పరీక్షలు



అవస్థలు పడుతూ వ్యాన్‌లో పరీక్షలకు వెళుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- భీమునిపట్నం : భీమిలి గ్రామీణ మండలం, జివిఎంసి పరిధిలో 13 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు తొలి రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయని ఎంఇఒ ఎం శివరాణి తెలిపారు.పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు ముందస్తుగానే చేపట్టడంతో విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాశారన్నారు.

పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి, పద్మనాభం, మద్ది, రేవిడి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలు పరీక్ష కేంద్రాలుగా సోమవారం నిర్వహించిన టెన్త్ పబ్లిక్ ప్రశాంతంగా ముగిసింది. 702 మంది విద్యార్థులకుగాను ఒకరు గైర్హాజరు కాగా, 701 మంది పాల్గొని పరీక్షలు రాశారు. మద్ది, పద్మనాభం పరీక్ష కేంద్రాలను తహశీల్దార్ వెంకటరావు పరిశీలించారు. ఎంఇఒ పి రమణ రెడ్డిపల్లి పద్మనాభం పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించి పరిశీలించారు. పరీక్ష కేంద్రాల ఆవరణలో రేవిడి పిహెచ్‌సి వైద్యాధికారి స్వప్న ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు.

ఆనందపురం : మండలంలోని ఐదు కేంద్రాల్లో సోమవారం తొలిరోజున పదవ తరగతి పరీక్షలకు 20మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ ఎస్.ఎస్.పద్మావతి తెలిపారు. నాలుగు ప్రభుత్వ పాఠశాలలు, ఒక ప్రయివేటు పాఠశాల కేంద్రంగా పరీక్షలు నిర్వహించగా, ఆనందపురం జెడ్‌పిహెచ్‌ఎస్ కేంద్రంలో 240 మంది, బి సెంటర్‌లో 220 మంది, బోయపాలెంలో 200, శొంఠ్యాంలో 212 మంది, పెద్దిపాలెం నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 196 మంది విద్యార్థులను కేటాయించగా, మొత్తంగా 1068 మంది విద్యార్థులకు గాను 1048 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఇఒ పద్మావతి తెలిపారు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు సౌకర్యాలు, పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశామన్నారు.

అనకాపల్లిడెస్క్: నర్సీపట్నంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది కేంద్రాల్లో సోమవారం మొదటి రోజు పరీక్షకు 1886 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈఓ నాగేంద్ర కుమార్, ఎంఇఒ -2 తలుపులు కేంద్రాలను పరిశీలించారు.

వ్యాన్‌లో పరీక్ష కేంద్రానికి తరలింపు

పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులను సరుకులు రవాణా చేసే లోడ్ వ్యాన్‌లో పరీక్షా కేంద్రానికి తరలించడం విశేషం.

అనకాపల్లి డెస్క్: ఎస్.రాయవరం మండలంలోని దార్లపూడి, కొరుప్రోలు, ధర్మవరం, యస్. రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిమ్మాపురం ఆదర్శ హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ విభీషణరావు తెలిపారు.

నక్కపల్లి: నక్కపల్లిలో బాలురు, గురుకుల పాఠశాల, గురూస్ స్కూల్‌లతో పాటు గొడిచెర్ల, వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. ఎంఈఓ నరేష్ మాట్లాడుతూ, మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా చర్యలు చేపట్టామన్నారు.

అనకాపల్లిడెస్క్: గొలుగొండ ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాల, చీడిగుమ్మల జిల్లా పరిషత్ హైస్కూల్, ఎఎల్ పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులు పరీక్షలను రాశారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా చీఫ్ సుధాకర్, డీవో సత్యనారాయణ చర్యలు తీసుకున్నారు.

అనకాపల్లిడెస్క్: మాకవరపాలెం ఉన్నత, మాంటిస్సోరి, తామరం ఇమ్మానుయేలు స్కూల్లో పరీక్షలు జరిగాయి.

కోటవురట్ల: మండలంలోని రెండు కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, ప్రభుత్వ పాఠశాల కేంద్రాల్లో 412 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

చీడికాడ: మండలంలో 493 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చీడికాడ ఆదర్శ పాఠశాల, కోణం గురుకుల పాఠశాలలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఇఒ-1 బొంజు బాబు తెలిపారు.

సబ్బవరం : మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ఎంఈఓ-1 ఎస్.లక్ష్మణరావు తెలిపారు. 928 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 917 మంది హాజరైనట్లు వెల్లడించారు. మండలంలోని రావులమ్మపాలెం జెడ్పీ హైస్కూల్‌ను, సబ్బవరం ప్రభుత్వ పాఠశాలను డీఈవో సందర్శించారు. కార్యక్రమంలో స్క్వాడ్ సాయి శైలజ పాల్గొన్నారు.



అనకాపల్లిలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పదవ తరగతి పరీక్షలకు 154 మంది విద్యార్థులు హాజరయ్యారు. దిబ్బిడి, గున్నెంపూడి, పెద్దమదిన జాజిమొగుల ఇంగ్లీష్ మీడియం స్కూల్, బుచ్చయ్యపేటకు చెందిన పాఠశాలల విద్యార్థులు ఈ కేంద్రంలో పరీక్షలు రాశారు.

కశింకోట : మండలంలో పదవ తరగతి మొదటి రోజు పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. కశింకోట జెడ్‌పి బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలు, శ్రీవివేకానంద పాఠశాల, నర్సింగబిల్లి, తాళ్లపాలెం, కన్నూరుపాలెం హైస్కూళ్ళ నుండి 1049 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 1046 మంది హాజరయ్యారు. నర్సింగబిల్లి పాఠశాల నుండి ఒకరు, తాళ్ళపాలెంలో ఇద్దరు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. సిఐ వినోద్ కుమార్ పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షించారు.

కె.కోటపాడు : మండలంలో సోమవారం ప్రారంభమైన పదవ తరగతి మొదటి రోజు పరీక్షకు 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ తెలిపారు. మండలంలో మూడు కేంద్రాలలో 558 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 545 హాజరైనట్లు వెల్లడించారు. మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తెలిపారు.

బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ

అనకాపల్లి : జిల్లాలో సోమవారం నుంచి జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ పర్యవేక్షించారు. అనకాపల్లి జెఎంజె ఇంగ్లీష్ మీడియం స్కూల్, జీవీఎంసీ టౌన్ గర్ల్స్ హైస్కూల్, కశింకోట మండలం డిపిఎం జెడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించారు. ఎస్పీ వెంట అనకాపల్లి టౌన్ ఎస్‌హెచ్‌ఓ శంకరరావు, కశింకోట ఎస్‌హెచ్‌ఓ వినోద్ బాబు ఉన్నారు

మామిడిలోవలో ముత్తంశెట్టి ప్రచారం

ప్రజాశక్తి - ఆనందపురం : భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మండలంలోని మామిడిలోవ గ్రామంలో ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా ఆంజనేయస్వామిని దర్శించుకుని, పూజలు అనంతరం ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మామిడిలోవ నాయకులు బలిరెడ్డి మహేష్ ఏర్పాటు చేసిన తీన్మార్ వాయిద్యాలతో ప్రచారం హోరుగా సాగింది. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆనందపురం మండలం, అందులోనూ మామిడిలోవ అంటే అభిమానం, శుభపరిణామమని భావించి, వచ్చే ఎన్నికలకు ఇక్కడి నుంచే ప్రచారాన్ని చేపడుతున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. నాయకులు కోరాడ వెంకటరావు, బంక సత్యనారాయణ, గన్‌రెడ్డి శ్రీనివాస్, బలిరెడ్డి, రమేష్ పాండ్రంకి శ్రీను, పినిశెట్టి సింహాచలంనాయుడు, కోరాడ ముసలి నాయుడు, లంక రాంబాబు, ఇల్లపు వెంకట జగన్ పాల్గొన్నారు,

న్యాయవాద వృత్తిలో లీగల్ డ్రాఫ్టింగ్ కీలకం

ప్రజాశక్తి -మధురవాడ : న్యాయవాద వృత్తిలో రాణించాలనుకునే యువత లీగల్ డ్రాఫ్టింగ్‌పై పట్టు సాధించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు సూచించారు. సోమవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రతిభావంతమైన కేసు రచన సరళమైన భాషతో, చెప్పదలచుకున్న విషయాలను తగిన ఆధారాలతో ఉండాలన్నారు. లీగల్ డ్రాఫ్టింగ్‌లోని బలమైన అంశాలకు న్యాయస్థానాలలో ఎంతటి ప్రాధాన్యత ఉంటుందో ఉదాహరణ సహితంగా వివరించారు. వివిధ రకాల లీగల్ డ్రాఫ్టింగ్ పద్ధతులను తెలిపారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. గీతంలో న్యాయవిద్య కోర్సుల బోధనా విధానం అత్యుత్తమంగా ఉందని అభినందించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గీతం స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ ప్రొఫెసర్ అనితారావు మాట్లాడుతూ కేసులలో కక్షిదారులకు సరైన న్యాయం జరగాలంటే డ్రాఫ్టింగ్ లోపాలు ఉండకూడదన్నారు. చట్టాలు, వివిధ తీర్పుల పట్ల లోతైన అవగాహన, పరిశీలన అవసరమన్నారు. లీగల్ డ్రాఫ్టింగ్ నైపుణ్యాలకు గీతం న్యాయ కళాశాల అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు జనసేన నేతల సవాల్



మాట్లాడుతున్న జనసేన నేత సోమశేఖర్

ప్రజాశక్తి- పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు ప్రస్తుత ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సిద్ధమాయని జివిఎంసి 97వ వార్డు జనసేన అధ్యక్షుడు శానాపతి సోమశేఖర్ నాయుడు పిలుపునిచ్చారు. సోమవారం. వార్డు పరిధిలోని సుజాతనగర్‌లో జనసేన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, పంచకర్ల రమేష్‌బాబు స్థానికేతరులని పదేపదే ఆరోపిస్తున్న అదీప్‌రాజ్, వైసిపి నేతలు, రాంపురం గ్రామానికి ఎమ్మెల్యేగా అదీప్‌రాజ్ ఏం చేశారో చెప్పాలని సవాల్ చేశారు. ఉన్న ఒక్క ఫ్లైఓవర్ బ్రిడ్జిని తన సొంత గ్రామానికి నిర్మించుకోలేకపోయారని ఆరోపించారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వైసిపి నేతలకు పట్టదన్నారు. 2009లో ఎమ్మెల్యేగా పంచకర్ల రమేష్ బాబు చేసిన అభివృద్ధిపై సమాచారహక్కు చట్టం కింద వివరాలు అడిగి తెలుసుకోవాలని, వాస్తవాలు గుర్తెరిగి మాట్లాడాలని హెచ్చరించారు. జనసేన జిల్లా నేత అయిత సింహాచలం మాట్లాడుతూ పెందుర్తి జనసేన టిక్కెట్ పంచకర్ల రమేష్‌బాబుకు ఖరారు కావడంతో అదీప్ అండ్ కోలో గుబులు పట్టుకుందన్నారు. వచ్చే ఎన్నికల్లో 70వేలు పైచిలుకు ఓట్ల మెజార్టీతో కూటమి అభ్యర్థి పంచకర్ల గెలుపు ఖాయమన్నారు సమావేశంలో మహిళానేత పార్వతి, 95 వ వార్డు అధ్యక్షులు మధు, 93వ వార్డు అధ్యక్షులు ఆదిబాబు ఇందల రమణ, రమేష్ పాల్గొన్నారు.

బిజెపి పాలనలో పరిశ్రమలు ప్రైవేటుపరం

ప్రజాశక్తి -గాజువాక : కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వరంగ పరిశ్రమలను నెలకొల్పితే, బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కటొక్కటిగా ప్రయివేటుకు ధారాదత్తం చేస్తోందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గంప గోవిందరాజులు అన్నారు. సోమవారం గాజువాకలో విలేకర్లతో మాట్లాడుతూ, బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పరిశ్రమలను మూసేయగా, కొన్నింటిని ప్రయివేటుకు కట్టబెట్టిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో సైతం వందశాతం వాటాలను ప్రయివేటుకు అమ్మేయాలని చూస్తుంటే, కార్మికుల ఉద్యమంతో అది ఆగిందన్నారు ఈసారి కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్ముడుపోవడం ఖాయమన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎపికి ప్రత్యేకహోదా సాధ్యమన్నారు. స్టీల్‌ప్లాంట్‌తోపాటు అనేక పరిశ్రమలను పరిరక్షించి, ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిర్వహించిన డిక్లరేషన్ సభ విజయంపై హర్షం వ్యక్తం చేశారు.సమావేశంలో చెల్లుబోయిన నాయుడు, అస్మిత్ ఆలీ, నొల్లి అప్పలరాజు, జి వెంకటరమణ, ఇ.వర్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పూర్వవైభవానికి కృషి

ప్రజాశక్తి- పెందుర్తి : అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని పెందుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్క రామనాయుడు అన్నారు. పార్టీ మండల అధ్యక్షునిగా నియమితులైన సందర్భంగా పెందుర్తిలో మాట్లాడుతూ, కాంగ్రెస్‌కు పూర్వవైభవానికి తనవంతు కృషి చేస్తానన్నారు.ప్రజలు మునుపటిలా కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్, పిసిసి అధ్యక్షురాలు షర్మిల, గిడుగు రుద్రరాజు, రాకేష్‌రెడ్డి, మాణిక్యం ఠాకూర్, స్థానికనాయకులు ఆడారి రమేష్‌నాయుడు, వేగి దివాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి- ఆనందపురం : గుడిలోవ ఎక్యూజే కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పాలవలస గ్రామంలో పౌష్టికాహారంపై పాఠశాలల విద్యార్థులకు, మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్-ఎస్ పిఒ పవన్‌కుమార్ మాట్లాడుతూ, వారం రోజులపాటు గ్రామంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రజాప్రయోజన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు, మహిళలకు శానిటరీపాడ్స్ అందజేశారు



భీమిలి టిడిపి టిక్కెట్‌పై వీడని సందిగ్ధత!

- ప్రచారాన్ని ప్రారంభించేదెప్పుడని కేడర్‌లో అసహనం
- అభ్యర్థి ప్రకటన, ప్రచారంలోనూ వైసిపి దూకుడు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ, భీమిలి అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ అభ్యర్థిని ప్రకటించడంలో టిడిపి అధిష్టానం ఇంకా తర్జన భర్జన పడుతోంది. మరోవైపు అధికార వైసిపి అధిష్టానం సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకే టిక్కెట్ ఖరారు చేసింది. జాబితాలో ప్రకటించడమే తరువాయి అన్నట్లుగా ముత్తంశెట్టి ఎన్నికల ప్రచారం ప్రారంభించేసారు. తనకే టిక్కెట్ వస్తుందన్న పూర్తి నమ్మకంతో ఉన్న ఆయన, దాదాపు ఆరు నెలల ముందే పార్టీ క్యాడర్‌ను ఆ దిశగా సమాయత్తం చేశారు. టిక్కెట్ కేటాయింపుపై కొంత అయోమయం నెలకొన్నప్పటికీ, సిటింగ్ ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి వైపే మొగ్గు చూపడంలో వైసిపిలో జోష్ కనిపిస్తోంది. 2019లో భీమిలి నియోజకవర్గం నుంచి వైసిపి తరపున ఎమ్మెల్యేగా గెలుపొందిన ముత్తంశెట్టి, తొలి కేబినెట్‌లో రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు . రెండేళ్ల పాటు మంత్రిగా, తర్వాత కొన్నాళ్లపాటు పార్టీ జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలను నిర్వహించారు. మంత్రి పదవి నుంచి తొలగించినా, పార్టీ జిల్లా అధ్యక్ష పదవి బాధ్యతలను వేరొకరికి అప్పగించినా సరే, పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపును అందుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ముత్తంశెట్టి ముందున్నట్టు పార్టీ అధిష్టానం గుర్తించి నందునే, భీమిలి నుంచి రెండో సారి పోటీకి అవకాశం కల్పించినట్లు అతని అభిమానులు చెబుతున్నారు. పోటీ అభ్యర్థి ఎవరైతే నాకేంటి అన్నట్లుగా ఇప్పటికే ఇంటింటా ప్రచారాన్ని ప్రారంభించిన ముత్తంశెట్టి, పార్టీ కేడర్‌ను కలుపుకుంటూ ముందుకు సాగుతున్నారు.

టిడిపి టిక్కెట్ ప్రకటనలో జాప్యంపై అసహనం

మరోవైపు బిజెపి, జనసేన పొత్తులతో భీమిలి స్థానాన్ని ఎవరికి కేటాయించాలని ఇన్నాళ్లూ డోలాయమానంగా ఉన్నప్పటికీ చివరకు టిడిపికే దక్కడంతో ఇపుడు అభ్యర్థి ఎవరన్నదీ ప్రకటనలో జాప్యం జరుగుతోంది. మరోవైపు ప్రధాన పోటీదారు అభ్యర్థి ప్రకటన, ప్రచారంలో దూకుడు పెంచుతుంటే, ఇంకా టిడిపి అధిష్టానం ఇప్పటికీ భీమిలి టిక్కెట్ ప్రకటించక పోవడంతో పార్టీ కేడర్‌లో ఒకింత అసహనం వ్యక్తమౌతోంది. అభ్యర్థి ఎవరనేది తెలియకుండా ప్రచారంలోకి ఎలా వెళ్లేదని, 'ముందరి కాళ్ళకు బంధం' వేసినట్లు అధిష్టానం వైఖరి ఉందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లు విపక్షంలో ఉండడంతో ఆ కష్టమేంటో తెలిసిన వారంతా ఈసారి ఎలాగైనా భీమిలి స్థానంలో ఘనవిజయం సాధించాలని భావిస్తుంటే, ఇలా జాప్యం చేస్తున్నారేంటని వాపోతున్నారు. కాగా భీమిలి టిడిపి టిక్కెట్ కోసం మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, పార్టీ నియోజక వర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో వీరిద్దరిలో ఎవరిని వరిస్తుందో, లేకుంటే కొత్తముఖం పోటీకి వస్తుందో తెలియని స్థితి ఉంది.

సన్‌రైజ్ చిల్డ్రన్స్ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్



వైద్యబృందంతో చిన్నారి, ఆమె తల్లిదండ్రులు

ప్రజాశక్తి - గాజువాక : గాజువాక సన్‌రైజ్ చిల్డ్రన్స్ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్ చేసి పసిపిల్ల ప్రాణాలను కాపాడారు. దీనికి సంబంధించి సోమవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్ ఎండీ డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ గణేష్ శంకు, డాక్టర్ పివి.రమణ వెల్లడించిన వివరాలివి.

విశాఖకు చెందిన ఉత్తేజ్ భార్య అమూల్య స్థానిక జనరల్ హాస్పిటల్‌లో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. పాపకు పుట్టుకతోనే ట్రాకియో ఇసోఫేజియల్ ఫిస్టులా, ఇసోఫేజియల్ ఎట్రిసియం అనే అరుదైన వ్యాధితో జన్మించింది. ప్రతి 3500 మంది శిశువుల్లో ఒకరికి మాత్రమే వచ్చే ఇలాంటి వ్యాధి ఉన్న శిశువులో శ్వాసకోశ నాళానికి, అన్నవాహికకు మధ్య ఫిస్టులా కనెక్షన్ ఉంటుంది. కానీ అన్నవాహికకు జీర్ణకోశానికి మధ్య ఎటువంటి కనెక్షన్ ఉండదు. ఆపరేషన్ చేస్తేగానీ బతికే అవకాశం ఉండని ఇటువంటి అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారిని గాజువాక సన్‌రైజ్ ఆసుపత్రి ఒక్కడుగు ముందుకేసి అడ్మిట్ చేసుకుంది. పీడియాట్రీషియన్స్ డాక్టర్ తిరుపతి, డాక్టర్ గణేష్ శంకుతోపాటు సర్జికల్ స్పెషలిస్ట్ డాక్టర్ రమణ, ఎనస్థీషియన్ డాక్టర్ శ్రీలక్ష్మిలతో కూడిన వైద్యబృందం బిడ్డ తల్లిదండ్రులతో చర్చించి, జనవరి 4న ఆపరేషన్ చేశారు. దాదాపు 35 రోజులపాటు వెంటిలేటర్‌పైనే ఉంచి ఉచిత వైద్యం అందించారు. ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్, న్యూమోథొరాక్స్, సెప్టిసీమియా, హైపోటెన్షన్, చాలాసార్లు ఎక్స్యుబేషన్ వైఫల్యం, లారింగోమలేసియా, రక్తహీనత వంటి ఎన్నో ఇబ్బందులు శిశువుకు తలెత్తినా, వాటిని ఎప్పటికప్పుడు గమనిస్తూ వైద్యసేవలు అందించారు. 31 రోజులపాటు సిపిఎపి మిషన్ ద్వారా బిడ్డకు ఆక్సిజన్ అందించారు. తల్లిపాలు ఇవ్వడంలో ఇబ్బంది తలెత్తడంతో సన్‌రైజర్స్ చిల్డ్రన్స్ ఆసుపత్రి వైద్యబృందం నిరంతర కృషితో ఆ సమస్యనూ పరిష్కరించారు.ఎప్పటికప్పుడు బిడ్డ పరిస్థితిని తల్లిదండ్రులకు వివరిస్తూ, వారికి మనోధైర్యం చెప్పి అవసరమైన వైద్యాన్ని అందించి బిడ్డ కోలుకునేలా చేశారు. సోమవారం బిడ్డను డిశ్చార్జి చేయడంతో బిడ్డ తల్లిదండ్రులు ఆనందంతో ఆసుపత్రి వైద్యబృందానికి ధన్యవాదాలు తెలిపారు. వేరే కార్పొరేట్ ఆసుపత్రుల్లో అయితే రూ.25 లక్షల నుంచి రూ.35లక్షల వరకు ఖర్చయ్యే వైద్యాన్ని అతితక్కువ ఖర్చుతో అందించడంతోపాటు మానవతాదృక్పథంలో శిశువు తల్లిదండ్రులకు ఆర్థికసాయాన్ని కూడా అందించారు. మీడియా సమావేశంలో డాక్టర్ సతీష్, డాక్టర్ నవీన్, డాక్టర్ ప్రతిభ ఆపరేషన్ టీంలో పాల్గొని విజయవంతం చేసినట్లు తెలిపారు.

పురస్కారాలను వెనక్కు ఇచ్చేసి నిరసన



పురస్కారాలను కార్యాలయంలో ఇచ్చేసిన శ్రీనివాసరావు

ప్రజాశక్తి- వేపగుంట : విధి నిర్వహణలో ప్రతిభకు జివిఎంసి ఇచ్చిన పురస్కారాలను వాపసు చేసి జివిఎంసి పారిశుధ్య కార్మికుడు దమ్ము శ్రీనివాసరావు నిరసన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో జరిగిన ప్రమాదంలో ఒక కన్నును కోల్పోయి, పాక్షిక అంధుడినైన తనకు ప్రభుత్వ పరంగా జివిఎంసి ఆర్థిక సాయాన్ని అందించి న్యాయం చేయాలని వేడుకుంటూ పలుమార్లు వినతులు, దరఖాస్తులు ఇచ్చినా స్పందన లేకపోవడం, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వ నిబంధనలు వర్తించవని అధికారులు మొండిచేయి చూపడంతో నిరసనగా తనకువచ్చిన పురస్కారాలను వాపసు చేశాడు. ప్రభుత్వం తరపున సాయానికి తాను అర్హుడిని కాకపోతే పురస్కారాలకు అనర్హుడినేని పేర్కొంటూ సోమవారం జివిఎంసి ఎనిమిదో జోన్ పబ్లిక్ హెల్త్ విభాగంలో ప్రతిభా పురస్కారాలన్నీ ఇచ్చేశాడు. మెడికల్ ఆఫీసర్ లేకపోవడం, సెక్షన్ గుమస్తా వాటినితీసుకోవడానికి నిరాకరించడంతో వైద్యాధికారి ఛాంబర్‌లోనే వదిలి వచ్చాడు మరింత పట్టుదలతో విధులను నిర్వర్తించి తానేంటే నిరూపించుకుంటానని శ్రీనివాసరావు అంటున్నాడు.

కెకె.రాజుకు అభినందనల వెల్లువ



కెకె.రాజును అభినందిస్తున్న నేతలు, అభిమానులు

ప్రజాశక్తి- సీతమ్మధార : వచ్చే ఎన్నికల్లో ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కె కె రాజుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పలు స్వచ్ఛంద, సేవాసంస్థలు, నాయకులు, స్థానికులు సామాజిక వర్గాల వారీగా కెకె.రాజును కలిసి, పుష్పగుచ్ఛాలను అందజేసి, అభినందనలు తెలియజేస్తున్నారు. కెకె.రాజుకు మద్దతు ప్రకటించి, గెలుపునకు కృషిచేస్తామని భరోసానిస్తున్నారు.

జైభారత్‌నగర్‌లో ఆత్మీయ సమావేశం

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె రాజు విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని జై భారత్‌నగర్ గ్రామ అధ్యక్షుడు బొగ్గు శీను అన్నారు సోమవారం 48వార్డు పరిధి బర్మా క్యాంపు జైభారత్‌నగర్ నూకాంబిక ఆలయం వద్ద నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కె.కె రాజు మాట్లాడుతూ, కష్టబడిపనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు, సముచితస్థానం వైసిపిలో లభిస్తుందనడానికి తానే నిదర్శనమన్నారు. ఆత్మీయ సమావేశంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, అల్లు శంకరరావు, కార్పొరేటర్ కె.అనిల్ కుమార్ రాజు, నీలి రవి, వసంతల అప్పారావు, కర్రి రామారెడ్డి, రాజాన గంగరాజు, కల్యాణ శ్రీను, రవి,బొడ్డేటి అనురాధ, రాజేష్, కె.అప్పారావు, వి.వెంకటేష్, కె.ప్రసాద్ ,పి.గణేష్, పి.నూకరాజు, రఘు, నాగేష్, కిరణ్, తులసి, సురేష్, భూలోక, పి.పద్మ, గేలాక్షి శ్రీను, హేమంత్, రాము పాల్గొన్నారు.

49వ వార్డులో...

ఉత్తర నియోజక వర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజుకు మద్దతుగా సోమవారం 49 వ వార్డు ఎన్జీవోస్ కాలనీ పట్టాభిరెడ్డి తోట వద్ద వార్డు కార్పొరేట అల్లు శంకరరావు, గ్రామ పెద్దలు బాపు నాయుడు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో లంక భాస్కరరావు, చిరికి వెంకటరావు, పరదేశి నాయుడు, చిరికి కొండలరావు, రాంబాబు, పోదూరి సూర్యనారాయణ, లాయర్ వెంకటరమణ, కర్రి చక్రధర్, అదిరెడ్డి శ్రీను, కిన్నెర ఆనంద్, జై వెంకటరావు, ఎస్.వి రమణ, లాలం వేణు, త్రినాధ్ పాల్గొన్నారు

మహిళా ఉద్యమ స్ఫూర్తి పెంటకోట చిట్టమ్మడు

వర్థంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

మహిళల సమస్యలపై అనేక ఉద్యమాలు చేసిన కామ్రేడ్ పెంటకోట చిట్టమ్మడు మహిళా ఉద్యమానికి స్ఫూర్తి అని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. మహిళా ఉద్యమ నేత, అనకాపల్లి మున్సిపల్ సిపిఎం మాజీ కౌన్సిలర్ కామ్రేడ్ పెంటకోట చిట్టమ్మడు 14వ వర్థంతి సభ అనకాపల్లి సిపిఎం కార్యాలయంలో సోమవారం సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగింది. చిట్టమ్మడు చిత్ర పటానికి కె.లోకనాథం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో చిట్టమ్మడు నిలదీసేవారని గుర్తు చేశారు. మున్సిపల్ కార్మికుల రెగ్యులైజేషన్ కోసం జరిగిన పోరాటంలో కౌన్సిల్ సమావేశాల్లో లేవనెత్తడమే కాకుండా బయట జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని వారికి మద్దతు తెలియజేసేవారని చెప్పారు. నిత్యం ప్రజల్లో వుంటూ తన దృష్టికి ఏ సమస్య వచ్చినా ప్రజలను సమీకరించి ఆ సమస్య పరిష్కారం అయ్యే వరకు పనిచేసేవారన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఉద్యమాలు నిర్వహించి వారికి బాసటగా నిలిచారని చెప్పారు. మహిళలు సొంతకాళ్ళపై నిలబడాలనే సంకల్పంతో వారికి ఉచితంగా కుట్టిమిషన్ల శిక్షణ, ఇతర అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారని గుర్తు చేశారు. అనకాపల్లిలో సిపిఎం నిర్మాణంలో విశేషమైన కృషి చేశారన్నారు. ఆమె తుదిశ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతం కోసం పరితపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.ప్రభావతి, ఎం.అప్పలరాజు, జి.కోటేశ్వరరావు, డి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



చిట్టమ్మడు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు



మాట్లాడుతున్న లా వర్సిటీ విసి సూర్యప్రకాశరావు

ఆత్మ రక్షణపై న్యాయ విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి- సబ్బవరం

స్థానిక దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా (సిడబ్ల్యుసిఎల్) ఆధ్వర్యాన ఆత్మరక్షణపై విద్యార్థులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ నేటి సమాజంలో రోజు రోజుకి మహిళలపై దాడులు, వేధింపులు పెరుగుతున్న తరుణంలో మహిళలు తమని తాము రక్షించుకునే మార్గాలను అన్వేషించడం చాలా అవసరమని చెప్పారు. విద్యార్థినులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రత్యేక నిపుణులు ఎస్. కిషోర్ కుమార్ మహిళలు పరిస్థితులకు అనుగుణంగా అప్రమత్తమై మెలకువతో వేగంగా ఎలా స్పందించాలో నేర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ నందిని, సిపిసిడబ్ల్యుసిఎల్ చైర్‌పర్సన్ విజయ లక్ష్మి, ఫ్యాకల్టీ మెంబర్ భువనేశ్వరి, విద్యార్థినులు పాల్గొన్నారు.

వరి సాగులో సస్యరక్షణ చర్యలపై అవగాహన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

శ్రీకాకుళం కింజరాపు ఎర్రమనాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం మండలంలోని పి.భీమవరం శివారు శ్రీరాంపురం గ్రామంలో వరి సాగు సమస్యలు – నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. వరిలో అధికంగా వచ్చే ఖాండం తెగులు వల్ల తీవ్ర నష్టాలు వాటిల్లుతాయని పేర్కొన్నారు. సస్యరక్షణ చర్యల ద్వారా నివారించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పినపోలు రాము నాయుడు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు శశికళ, పూజిత, శ్రావణి, పల్లవి, నికిత షారోన్, తేజస్విని, ప్రత్యూష, గ్రామ రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

ప్రజలను మోసం చేసిన వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అభివృద్ధి గాలికొదిలేసి ప్రజలను మోసం చేస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. జగన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను సర్వనాశనం చేసిందన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైయస్సార్సీపి, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలు వేరువేరు కాదని, ఈ రెండు పార్టీలు ఒకే కుటుంబానికి చెందిన వని తెలిపారు. జగన్ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. వైసిపీలో చోటా నాయకుడు నుండి ఎమ్మెల్యేలు, మంత్రులు అవినీతి సంపాదనలో పోటీ పడుతున్నారని ఆరోపించారు. జగన్ చేతకానితనం వల్ల పోలవరం ప్రాజెక్టు ముందుకు కదల్లేదన్నారు. పోలవరం ఎడమ కాలువ పనులు ఈ 5 సంవత్సరాల కాలంలో పూర్తి చేయకుండా ఉత్తరాంధ్ర ప్రజలను రైతాంగాన్ని మోసం చేశారని తెలిపారు. విశాఖ జిల్లాలో కలెక్టర్ కార్యాలయం, రైతు బజారు భవనాలు, ప్రభుత్వ కళాశాలతో సహా అనేక ప్రభుత్వ ఆస్తులను జగన్ ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం జనసేన భాజపా ఓటమి ఘనవిజయం సాధిస్తుందని చెప్పారు.

గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి- కశింకోట

తెలుగు దేశం, బిజెపి, జనసేన పార్టీల కోర్ కమిటీలు కసింకోట మండలంలోని ఏనుగుతుని, నూతనగుంటపాలెం, జట్టపురెడ్డితుని గ్రామాల్లో సోమవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మూడు పార్టీల నాయకులు నిమ్మదల సన్యాసినాయుడు, గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిని రమణమూర్తి, బుద్ధిరెడ్డి చిన్న, కరక సత్యనారాయణ, పెంటకోట రాము, సిదిరెడ్డి శ్రీను, పంచదార్ల సూరిబాబు, కాండ్రేగుల సతీష్, కర్రి సత్యనారాయణ, కలగ సోమేశ్వరరావు, నైనంశెట్టి రమణారావు, మజ్జి నానిబాబు, మజ్జి కుమార్, మజ్జి సూర్యప్రకాష్, మజ్జి కన్నబాబు, షేక్ దర్గా, గొంతిని చిరంజీవి, అందే సన్యాసిరావు, కలిగేట్ల సరస్వతి, అందే రమణ పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్‌లో 400 కేజీల గన్ మెటీరియల్ చోరీ

ప్రజాశక్తి -చోడవరం : గోవాడ చక్కర కర్మాకారంలో సుమారు 400 కేజీల గన్ మెటీరియల్ చోరీకి గురైంది. సుమారు రూ.20 లక్షల విలువ కలిగిన వివిధ రూపాల్లో ఉన్న మెటీరియల్‌ను దొంగిలించారు. దీనిపై ఫ్యాక్టరీ ఎమ్‌డి వి సన్యాసినాయుడు సోమవారం చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో8 సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. పటిష్టమైన సెక్యూరిటీ ఉన్న చక్కర కర్మాగారంలో సామాన్లు తరచూ దొంగలు ఎత్తుకెళ్లడం పరిపాటిగా మారింది. ఫ్యాక్టరీలోకి చెరుకు సరఫరా చేసిన రైతులనే వెళ్లడానికి ఆరా తీసే సెక్యూరిటీ సిబ్బంది దొంగలు సామాన్లు ఎత్తుకుపోతున్న వీరి కంట పడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆర్థిక నష్టాలతో రైతులకు సకాలంలో బట్వాడా చేయలేని ఫ్యాక్టరీకి దొంగతనాలు వలన మరింత నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన దర్యాప్తు జరిపి నిందితులను శిక్షించాలని కార్మికులు. రైతులు కోరుతున్నారు.

'యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా..'

ప్రజాశక్తి-అనకాపల్లి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి శాసనసభకు పోటీ చేస్తున్న తనకు ఒకసారి అవకాశం ఇస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని వైసిపి అభ్యర్థి మలసాల భరత్ కుమార్ అన్నారు. అనకాపల్లి వైసిపి కార్యాలయంలో భరత్ కుమార్ సమక్షంలో అనకాపల్లి మండలం, మాకవరం గ్రామానికి చెందిన వసాది రమణ ఆయన అనుచరులు వెంకటరమణ, రమేష్, ఆదిబాబు, రాము, సాయి తదితరులు 15 మంది వైసిపిలో చేరారు. వారికి భరత్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ తాను అమెరికా వంటి దేశంలో సాఫ్ట్‌వేర్ కంపెనీలను ఏర్పాటుచేసి ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే నియోజకవర్గంలో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి అనకాపల్లి మండల పార్టీ అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద్, జిల్లా యువజన నాయకులు మలసాల కుమార్ రాజా, మాకవరం గ్రామ ప్రజలు యువత పాల్గొన్నారు.



వైసిపి కండువాలు వేస్తున్న భరత్‌కుమార్

ఎన్నికల నియమావళికి లోబడి ఉండాలి

రాజకీయ పార్టీలకు స్పష్టం చేసిన కలెక్టరు రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల నియమావళిని తు.చ. తప్పక పాటించాలని జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్ శెట్టి రాజకీయ పార్టీలకు స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోనికి వచ్చినందున ప్రదర్శనలు, ప్రచార పత్రికలు, హోర్డింగులు ఏర్పాటు మొదలైన వాటికి తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రార్థనా స్థలాలు, ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, కార్యాలయాలలో సభలు, సమావేశాలు ఏర్పాటు చేయకూడదని, సమావేశాలకు పోలీసు, రిటర్నింగ్ అధికార్ల అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనుమతుల కొరకు సువిధ యాప్ ద్వారా ధరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ప్రభుత్వ పనులకు ప్రారంభోత్సవాలు జరుపకూడదని, ప్రస్తుతం పురోగతిలో వున్న వాటిని కొనసాగించవచ్చని చెప్పారు. సామాజికవర్గ, మతపరమైన కార్యక్రమాలు నిర్వహించరాదని, ఎవరినీ ప్రభావితం చేసేలా ఉపన్యాసాలు, ప్రకటనలు చేయకూడదని తెలిపారు. పార్టీల వారీ, అభ్యర్థుల పరంగా ప్రచార ఖర్చులను నిబంధనలను అనుసరించి లెక్కించడం జరుగుతుందన్నారు. ఖర్చులకు సంబంధిన రేట్ చార్టును కలెక్టరు కార్యాలయంలో పొందవచ్చన్నారు. ప్రైవేట్ స్థలం, ఇళ్లు, గోడలపై ప్రచార పోస్టర్లు, హోర్డింగులు ఏర్పాటు చేసుకున్నట్లయితే వాటి యజమాని అనుమతి రాతపూర్వకంగా తీసుకుని సమర్పించాలని సూచించారు. పోస్టర్లు, కరపత్రాలపై ప్రింటర్‌తోపాటు ప్రింట్ చేయించేవారి వివరాలు, సంఖ్య తప్పని సరిగా ముద్రించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, డి.సి.ఎ.ఓ. గోవిందరాజులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బుద్ద నాగ జగదీశ్వరరావు (తెలుగుదేశం), గొర్లె సూరిబాబు (వైసిపి), కె.వి.సత్యనారాయణ (కాంగ్రెస్), బొలిశెట్టి శ్రీనివాసరావు (తెలుగుదేశం), కొల్లిరావు (ఆమ్ ఆద్మీ), శేషగిరి (బి.జె.పి.) తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని ఆనందపురం గ్రామంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారు నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ వంటాకు అప్పాజీ ప్రారంభించారు. ఈ శిబిరంలో 109 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, ఐ డ్రాప్స్ అందించారు. 55 మంది రోగులను కంటి ఆపరేషన్స్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి బస్‌లో తరలించారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, పేదలకు వైద్య సేవలు అందిస్తున్న అమ్మ చారిటబుల్ ట్రస్ట్ బృందాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ సింగంపల్లి అర్జున, ఎంపిపి స్కూల్ హెచ్ఎం డిఎస్ఎన్.మూర్తి, బి.దేముళ్లమ్మ, సెక్రెటరీ సింగంపల్లి అచ్చిబాబు, ట్రస్ట్ సభ్యులు కర్రి గోవింద్, రెడ్డి శేషు, లెక్కల సత్యనారాయణ, లెక్కల రాము, రావాడ గణేష్ యాత్, శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు డాక్టర్ జాక్సన్, క్యాంప్ డిప్యూటీ మేనేజర్ అరుణ్ కుమార్ వైద్య సేవలు అందించారు.



విద్యార్థులతో కో-ఆప్షన్ సభ్యులు అప్పలరాజు

టెన్త్ విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు తరలించిన కో-ఆప్షన్ సభ్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని కొండుపాలెం గ్రామం నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను తన సొంత నిధులతో ప్రతిరోజు పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బొండా ఉమా, ఎంపీటీసీ కోఆప్షన్ సభ్యులు బొండా అప్పలరాజు ఏర్పాట్లు చేశారు. గ్రామం నుంచి 21 మంది విద్యార్థుల్ని ఆటోల ద్వారా మామిడిపాలెం హైస్కూల్‌కు ప్రతిరోజు తీసుకెళ్లి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు వారు చెప్పారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి మన గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తల్లిదండ్రులు దీనిపై హర్షం వ్యక్తం చేశారు.

టిడిపి కార్యకర్త రమణకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని బుచ్చయ్యపేట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త తిర్రి రమణ (అన్న) కాలికి ఆపరేషన్ చేసి రెండు వేళ్ళు తీసివేశారు. బెడ్ రెస్టులో వున్నా రమణను తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి, సోమవరం మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు సోమవారం పరామర్శించి, రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి, అచ్చెర్ల టీడీపీ అధ్యక్షులు నైనంశెట్టి రమణారావు, తాళ్లపాలెం టీడీపీ అధ్యక్షులు ఉల్లింగల రమేష్, గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకునాయుడు, ఎంపీటీసీ నాయుడు, తిర్రి చిరంజీవి, బుదిరెడ్డి రామారావు, కోన నూకినాయుడు, నారిపల్లి ప్రసాద్, తిర్రి రమణ, నాగేష్ పాల్గొన్నారు.




ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీనివాసరావు

వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

ప్రజాశక్తి- కె.కోటపాడు

వ్యవసాయ విద్యుత్తు పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎలక్ట్రికల్ ఏఈ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయనబాబు మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులు రైతు లేని సమయంలో, వారికి తెలియకుండా విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లు అదానీ కంపెనీ వద్ద నుంచి రూ.600 కోట్లతో కొనుగోలు చేశారని తెలిపారు. రైతుల వద్ద నుంచి యూనిట్‌కు ఎనిమిది రూపాయల పది పైసలు వసూలు చేసి తిరిగి దానిని రైతులకు నగదు బదిలీ చేస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. గతంలో గ్యాస్ బండకు నగదు బదిలీ చేసి తర్వాత పూర్తిగా దానిని విరమించుకున్నారని, ఇది కూడా ఆ విధంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు వైసిపి ప్రభుత్వం ఇటువంటి జిమ్మిక్కులు చేస్తుందని ఆరోపించారు. గత రెండు సంవత్సరాల నుంచి సిపిఎం, రైతు సంఘాలు ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రైతులందరూ ఈ విధానాన్ని వ్యతిరేకించాలని, ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలు గ్రామాల్లో అమర్చిన స్మార్ట్‌మీటర్లను వెంటనే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, రైతు సంఘం నాయకులు వనము సూర్యనారాయణ, నాయకులు సబ్బవరపు ముత్యాలనాయుడు, వేమల లక్ష్మి, ముర్రు చిన్నమనాయుడు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ ఎఇకి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

బాలికల వసతి గృహానికి రాంకీ ఫౌండేషన్ వితరణ

ప్రజాశక్తి - పరవాడ

పరవాడ ప్రభుత్వ బాలికల వసతి గృహానికి రాంకీ ఫౌండేషన్ పది ఫ్యాన్లు, 5 ట్యూబ్ లైట్లు, ఐదు చార్జింగ్ లైట్లు సమకూర్చింది. కొన్ని రోజుల నుండి వసతి గృహంలోని ఫ్యాన్లు పనిచేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని వసతి గృహ సంక్షేమ అధికారి సుజాత రాంకీ ఫౌండేషన్ ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వసతి గృహానికి అవసరమైన సామాగ్రిని ఫౌండేషన్ ప్రతినిధులు సమకూర్చారు. వీటిని విశాఖ ఫార్మాసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లాల్ కృష్ణ సోమవారం ఉదయం వసతిగృహ సంక్షేమ అధికారికి అందజేశారు. భవిష్యత్తులో కూడా తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ రావు భక్షి, లైజనింగ్ ఏజీఎం రాఘవరెడ్డి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ శ్రీకాంత్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



ఫ్యాన్లు, చార్జింగ్ లైట్లు అందజేస్తున్న రాంకీ ప్రతినిధులు



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న నివేదిత

ఉపాధి హామీ కూలీలను కలిసిన నివేదిత

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం, పరవాడ పాలెం, జమాదులపాలెం గ్రామాల్లో ఉపాధి కూలీలను వైసిపి అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్ సతీమణి మలసాల నివేదిత సోమవారం కలిశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె కూలీలను కలిసి తన భర్తకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కసింకోట ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి శేషు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి-కె.కోటపాడు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లకు మనోధైర్యం చేకూర్చేందుకు సెంట్రల్ కమాండోలతో అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు ఏ.కోడూరు ఎస్ఐ జె రమేష్ పర్యవేక్షణలో సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. మండలంలోని ఆర్‌వై అగ్రహారం, ఆనందపురం, వి సంతపాలెం, మేడిచర్ల గ్రామాల్లో నిర్వహించిన ఈ కవాతులో ఎస్ఐ మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మీకు నచ్చిన నాయకుడిని ఎన్నుకొనే హక్కు ఓటర్లకు ఉందని, ప్రజా రక్షణకు పోలీసులు రక్షణ కవచంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది తాతబాబు, శ్రీను, సన్నీ బాబు, సింహాచలం నాయుడు, రామలక్ష్మి, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయం హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి దేవుని గుమ్మం శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయ మండపంలో సోమవారం హుండీ లెక్కింపు జరిగింది. మొత్తం 39 రోజులకు గాను రూ.1,70,773 ఆదాయం వచ్చినట్టు ఆలయ కమిటీ చైర్మన్ సకల రాజ్యలక్ష్మి గోవిందరావు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఈవో టి రాజ సులోచన, ధర్మకర్తలు శ్రీధరాల కోమలి, రాజాన లక్ష్మి శ్రీనివాసరావు, సుంకర వెంకటేశ్వరరావు, లక్ష్మి సూరిశెట్టి చిన్న సన్యాసిరావు, ఉమ్మిని పైడిరాజు, పర్యవేక్షణ అధికారి ఎస్‌వివి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

సకాలంలో ఎన్నికల రిపోర్టులు పంపించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల విభాగాలన్ని సమర్థవంతంగా పని చేస్తూ సకాలంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ కార్యాలయానికి రిపోర్టులు పంపాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలక్టరు రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలక్టరు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.వి.మురళీ కృష్ణతో కలసి పాల్గొన్నారు. ఎం.సి.సి., ఎమ్.సి.ఎమ్.సి., స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వలెన్స్, వీడియో వీవింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్, మొదలైన టీములు కుణ్ణమైన అవగాహన, గట్టి నిఘాతో పని చేయాలన్నారు. పోలీసు, రెవిన్యూ, ఎక్సైజ్, ఆదాయపు పన్నుశాఖ, సమాచార శాఖ మొదలైన శాఖలు సమన్వయంతో నిబంధనల ప్రాకారం సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రభుత్వ యంత్రాంగం ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడమే కాకుండా దాన్ని నిర్భయంగా వినియోగించుకునేలా చూడాలని ఆదేశించారు. మద్యం, మాదకద్రవ్యాల పై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేవించారు. ఎస్‌పి మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశామని, సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సభలు సమావేశాలకు సందర్భాన్ని బట్టి అనుమతులు బలగాల నియామకం చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ బి విజయభాస్కర్, డిఆర్ఓ బి దయానిధి, జీఎస్ వి ఎస్ అధికారి మంజులవాణి, కోపరేటివ్ అధికారి గోవిందరాజులు, డిసిఓ కిరణ్ కుమారి, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, ఆర్డీవో ప్రకాశరావు, సిపిఓ రామారావు, డీఎస్ఓ కేవీఎల్ మూర్తి, జీఎస్టీ అధికారి అపర్ణ, ఎక్సైజ్ అధికారి సునీత, పౌరసరఫరాల డిఎం పి.జయంతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, చిత్రంలో ఎస్‌పి మురళీకృష్ణ తదితరులు

ఎన్నికల ప్రచార వాహనాలు, సభలకు

అనుమతులు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్వో గీతాంజలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఎన్నికల ప్రవర్తన నియామావళిని పటిష్టంగా అమలు చేయాలని నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.గీతాంజలి ఆదేశించారు. నక్కపల్లిలో తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎలక్షన్ డీటీ చైనులు, డిటి సత్యనారాయణ సహా పలు శాఖలకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులో వున్నందున ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులందరికీ ఎన్నికల నియమావళిపై అవగాహన కలిగి వుండాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, చెక్‌పోస్టుల తనిఖీ బృందం, వీడియో కవరేజ్ బృందాలు, సెక్టార్, రూట్ ఆఫీసర్లకు ఆమె పలు సూచనలు చేశారు. రాజకీయ పార్టీల ప్రకటనల బోర్డులను పూర్తి స్థాయిలో తొలగించాల్సివుందని, ఎవరైనా తొలగించకపోతే వాటిని తొలగించి, అందుకయ్యేఖర్చు వారి నుంచి సంబంధిత రాజకీయపార్టీ పేరుతో నమోదు చేయాల్సి వుంటుందన్నారు. నియోజకవర్గంలో అభ్యర్థుల ప్రచార వాహనాలకు ముందుగా ఆర్వో అనుమతులు ఉండాలని తెలిపారు. ఎన్నికల బహిరంగసభలకు కూడా అనుమతులు తప్పనిసరన్నారు. పోలింగ్ బూత్‌కు 200 మీటర్ల పరిధిలో రాజకీయ ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయకూడదన్నారు.

అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించి సెక్టార్ అధికారులతో ఆర్డీవో జయరాం సమావేశం సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, సచివాలయాల వద్ద ఉన్న ప్రభుత్వ పథకాల పోస్టర్లను తొలగించాలన్నారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీరాములు, టౌన్ సీఐ కాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ



ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రూ.40వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట గ్రామ అంబేద్కర్ యూత్ మన వాళ్ళకోసం మనం ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు నర్సీపట్నంకు చెందిన మద్ర శ్రీహరికి రూ.40వేల ఆర్థిక సాయం అందజేశారు. సెంట్రింగ్ పనిలో రెండు అంతస్తుల బిల్డింగ్ పైనుంచి శ్రీహరి పడి పోవడతో మంచానికి పరిమితమైన కుటుంబ సభ్యులను ఆర్గనైజేషన్ సభ్యులు పరామర్శించి ఈ ఆర్థిక సాయాన్ని అందించారు.ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ కోశాధికారి దొండా రమేష్ మాట్లాడుతూ, మావాళ్ల కోసం మాత్రమే సహాయం చేయాలన్న ఆలోచనతో పెట్టిన ఆర్గనైజేషన్ ఎవరో తెలియకపోయినా అవసరమైన వారికి సహాయం చేయడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు సరిసా అశోక్, వీరబాబు, చిట్టియ్య, సంతోష్ పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న ఎంపిడిఒ

వాలంటీర్లపై విచారణ

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:గొలుగొండ మండలం కొత్తమల్లంపేట గ్రామంలో వాలంటీర్స్ ఎన్నికల ప్రచారంపై ఎంపిడిఒ రత్నకుమారి ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వాలంటీర్స్ ప్రచారం చేయడంపై విచారణ చేపట్టామని, కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు.సచివాలయ సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని సూచించారు. శిలాఫలకాలపై అసంపూర్తిగా బ్లాక్ చేయడంపై ఆమె సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. దగ్గరుండి విగ్రహాలను పూర్తిగా కప్పించారు. మొక్కుబడిగా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, ఈఒపిఆర్‌డి, పోలీస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-పాయకరావుపేట:సమిధ సంస్థ అధ్వర్యంలో ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ సహకారంతో మానసిక ఆరోగ్యంపై పాయకరావుపేటలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇప్పటివకూ సుమారు మూడు జిల్లాల్లో 60 క్యాంప్స్ ద్వారా 4350 మందికి అవగాహణ కల్పించామని సమిధ సంస్థ కార్యదర్శి డి.వీరభద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాగంగా పాయకరావుపేటలోని గవర్నమెంట్ ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అనంతగిరి:స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సమిధ సంస్థ అధ్వర్యంలో ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పటివకూ సుమారు మూడు జిల్లాల్లో 62 క్యాంపులు ద్వారా 4450 మందికి అవగాహన కల్పించామని సమిధ సంస్థ కార్యదర్శి డి.వీరభద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాగంగా సోమవారం అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 100 విద్యార్థులకు అవగాహన కల్పించి ఆరోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు బుద్ధ రాజు, సింహాద్రి, అప్పలరాజు, దేముడమ్మ, చంటి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

పార్టీ గెలుపునకు కృషి

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషి చేయాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామస్థాయిలో నిరంతరం గెలుపు కోసం శ్రమించాలని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కంటే మరింత ఎక్కువగా మెజార్టీ వచ్చేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

620 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 620 మందిని బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు మాకవరపాలెం ఎస్సై రామకృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 31 పంచాయతీల పరిధిలో ఎలాంటి గొడవలు తలెత్తకుండా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన 620 మందిపై ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్సై తెలిపారు.



మాడుగుల టికెట్ కేటాయింపుపై పునరాలోచించాలని..

టిడిపి నేతల ర్యాలీ

ప్రజాశక్తి -చీడికాడ:మాడుగుల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే టికెట్ కేటాయింపు పై అధిష్టానం మరొక్కసారి ఆలోచించి కార్యకర్తల మనోభావాలను తెలుసుకోవాలని చీడికాడలో టిడిపి శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు పోతల చిన్ననాయుడు, బొబ్బాది తాతారావుల ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు చీడికాడ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ అధినేతకు కొంతమంది తప్పుడు సంకేతాలు ఇవ్వడంతో ప్రజలతో గుర్తింపు పొందిన వ్యక్తికి టిక్కెట్టు దక్కలేదన్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ పార్టీని బలోపేతం చేస్తూ ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలను గవిరెడ్డి రామానాయుడు అందించారని గుర్తు చేశారు. గవిరెడ్డి వెంట నియోజకవర్గంలోని టిడిపి శ్రేణులు అధికంగా ఉన్నారని తెలిపారు. ఆయనకు టిక్కెట్టు కేటాయించక పోవడంతో నియోజకవర్గంలో అత్యధిక శాతం టిడిపి శ్రేణులు మానసిక వేదనకు గురయ్యారన్నారు. గవిరెడ్డికి టిక్కెట్టు కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో మాడుకుల నియోజకవర్గం టిడిపి కైవశం చేసుకోవడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు కొల్లి సూరి నాయుడు, బొబ్బాది తాతారావు, గండి ముసలి నాయుడు, రొంగలి రామనాయుడు, నానాజీ, వరహాపురం రమణ, పైల ముత్యాల నాయుడు, పలు గ్రామల నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న టిడిపి నేతలు

ఫిట్జీ ద్రోణాచార్య స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఫిట్జీ ద్రోణాచార్య స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఆర్.ఎల్.త్రిభా తెలిపారు. నగరంలోని ఆ విద్యాసంస్థలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఫిట్జీ ద్రోణాచార్య పరీక్షను ఏప్రిల్ 7వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరో తరగతి నుంచి ప్లస్ టు విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కావచ్చని చెప్పారు. 6, 7, 8వ తరగతి విద్యార్థులకు రూ.750, 9 నుంచి నుంచి ప్లస్ టు విద్యార్థులకు రూ.1500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఈ ఫీజుపై 99 శాతం వరకు మినహాయింపు రూపంలో ప్రోత్సాహకాలను కూడా పొందవచ్చునని వివరించారు. మరింత సమాచారం కోసం https://dronacharyaexam.fiitjee.com/registration-process.html ను చూడాలని కోరారు. పరీక్ష కోసం ఏప్రిల్ 5వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు www.fiitjee.com/dronacharya వెబ్‌సైట్‌ను సందర్శించడం, లేదా ఏదైనా ఫిట్జీ కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు.

విశాఖలో హయర్ ఇండియా సరికొత్త ఉత్పత్తులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : హయర్ అప్లయన్సెస్ తన 20వ వార్షికోత్సవం సందర్భంగా 'మేక్ ఇన్ ఇండియా' 'మేడ్ ఫర్ ఇండియా' కోణంలో సరికొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టిందని సంస్థ ఇండియా ప్రెసిడెంట్ ఎన్.ఎస్. సతీష్ వెల్లడించారు. నగరంలోని ప్రముఖ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఒఎల్ఇడి, క్యుఎల్ఇడి టీవీలు, సూపర్ హెవీ డ్యూటీ ఎయిర్ కండిషనర్ సిరీస్, కినోచి బ్లాక్ ఎయిర్ కండిషనర్, వోగ్ స్మార్ట్ కన్వర్టిబుల్ రిఫ్రిజిరేటర్లు, వాషర్ డ్రైయర్ ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్, కమర్షియల్ రిఫ్రిజిరేషన్ సొల్యూషన్ లు, వాణిజ్య ఎయిర్ కండిషనర్లు ఉన్నాయన్నారు.

19వ వార్డులో ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి 19వ వార్డు పరిధి లాసన్స్ బే కాలనీ, పెదవాల్తేరు ప్రాంతాల్లో వార్డు వైసిపి ఇన్‌ఛార్జి సూరాడ లక్ష్మీదాస్‌తో కలిసి తూర్పు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవివి.సత్యనారాయణ మాట్లాడుతూ, సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ఏకకాలంలో అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

జివిఎంసి 22వ వార్డు పరిధి బలరాం నగర్ ప్రాంతానికి చెందిన ఉల్లంగల వీరినాయుడు (60) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎంవివి సత్యనారాయణ పరామర్శించారు. కార్యక్రమంలో మొల్లి అప్పారావు, పీతల గోవిందు, ఉల్లంగల సూరిబాబు పాల్గొన్నారు.

తూర్పు నావికాదళంలో టైగర్ ట్రయంఫ్ విన్యాసాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారత్, అమెరికా మధ్య కుదిరిన భాగస్వామ్యానికి అనుగుణంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక త్రివిధ దళాల మానవతా సహాయం, విపత్తు సహాయ (హెచ్ఎడిఆర్) విన్యాసం టైగర్ ట్రయంఫ్-24 ఈ నెల 18 నుంచి 31 వరకు తూర్పు సముద్ర తీరంలో జరగనున్నాయి. ఈ విన్యాసాల్లో భాగంగా షిప్ సోమవారం విశాఖ చేరుకుంది. ఇండియన్ నేవీ నౌకలు, ఎయిర్ క్రాఫ్ట్, ఇండియన్ ఆర్మీ సిబ్బంది, వాహనాలు, ర్యాపిడ్ యాక్షన్ మెడికల్ టీమ్ (ఆర్ఏఎంటీ)తో పాటు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానాలు, హెలికాప్టర్లు పాల్గొంటాయి. యుఎస్ మెరైన్ కార్ప్స్ , యుఎస్ ఆర్మీకి చెందిన ఎంబార్డ్ దళాలతో యుఎస్ నేవీ నౌకలు యుఎస్‌కు ప్రాతినిధ్యం వహిస్తాయి.

దిబ్రూగఢ్-కన్యాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ సేవలు పెంపు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రయాణికుల అవసరాల దృష్ట్యా 22504/22503 దిబ్రూగఢ్-కన్యాకుమారి-దిబ్రూగఢ్ వివేక్ ఎక్స్‌ప్రెస్ సేవలను వారానికి 4 రోజుల నుంచి 5 రోజులకు పెంచాలని రైల్వే శాఖ నిర్ణయించింది. 22504 దిబ్రూగఢ్-కన్యాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22వ తేదీ నుంచి ప్రతి మంగళ, గురు, శుక్ర, శని, ఆదివారాల్లో దిబ్రూగఢ్ నుంచి బయలుదేరుతుంది. రైలు నెంబర్ 22503 కన్యాకుమారి-దిబ్రూగఢ్ వివేక్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26వ తేదీ నుంచి ప్రతి సోమ, మంగళ, బుధ, గురు, శనివారాల్లో కన్యాకుమారి నుంచి బయలుదేరుతుంది. ప్రజలు ఈ అదనపు రైలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి కోరారు.

రారండోయ్ వేడుక చూద్దాం...!



-నేడు వెంకన్న ఉత్సవాలకు శ్రీకారం

ప్రజాశక్తి-నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాలు ఈనెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు 10 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. రాష్ట్రం నలు మూలల నుంచి స్వామి వారి కల్యాణం తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. 20న బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా టిటిడి అధికారులు ఏర్పాట్లను పూర్తి చేసారు.

ఉత్సవాల షెడ్యూల్...

ఈనెల 19వ తేదీ మంగళవారం ఉత్సవాలు ప్రారంభ సూచికంగా ముహూర్తమును అనుసరించి గ్రామ తిరువీధిలో ఉత్సవ కావిడితో అర్చక బృందం శ్రీకారం చుడతారు. సాయంత్రం పుట్టమన్ను కార్యక్రమం, అనంతరం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులతో అశ్వవాహనంపై తిరువీధి సేవ నిర్వహిస్తారు. 20న స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ఆలయంలో మధ్యాహ్నం 12 గంటలకు ధ్వజారోహణ, రాత్రి ఉపమాక సింహాద్రాచార్యులు ఇంటి వద్ద ఎదురు సన్నాహ మహోత్సవం (కన్యావరుణ సంవాదం), తిరువీధిలో రథోత్సవం, అనంతరం ఆలయ కల్యాణ వేదిక వద్ద అంగరంగ వైభవంగా స్వామి కల్యాణమహోత్సవము జరుగుతుంది. 21న ఉదయం నుంచి సర్వ దర్శనాలు, రాత్రికి తిరువీధి సేవ, 22న విశేష నివేదనలు, 23న రాత్రి ఆలయం వద్ద సదస్యం (పండిత సభ), అనంతరం తిరువీధి సేవ, 24న తోటోత్సవం సి. హెచ్. లక్ష్మిపురం గ్రామ సమీపంలో తోట వద్దకు స్వామి ఉత్సవమూర్తులను రాజాధిరాజ వాహనంలో తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 25న రాజయ్యపేట సముద్రతీరంలో చక్రస్నాన మహోత్సవం నిర్వహిస్తారు. రాత్రికి రథోత్సవం, 26, 27, 28వ తేదీల్లో పుష్పయాగోత్సవం నిర్వహిస్తారు. దీంతో వార్షిక కళ్యాణోత్సవాలు ముగుస్తాయి.

18 రోజుల తీర్థం

స్వామి వార్షిక కళ్యాణోత్సవాలు సందర్భంగా 18 రోజుల పాటు ఉపమాకలో తీర్థం జరుగుతుంది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన చిల్లర వ్యాపారులు తాత్కాలింగా కమ్మల పాకలు వేసుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకుని పలు వ్యాపారాలు చేసుకుంటారు. చిన్న చిన్న బొమ్మలు దుకాణాలతో పాటు, తోపుడు బండ్లు, మిఠాయి కొట్టులు తీసుబండరాలు దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మసాలా దినుసులు వ్యాపారం ఇక్కడ ప్రత్యేకం.

టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

స్వామి కల్యాణోత్సవాలు సందర్భంగా టిటిడి ఆధ్వర్యంలో ఆలయం వద్ద పలు ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంలో గోపురాలు, ఇతర కట్టణాలు, గరుడాద్రి పర్వతంపై మెట్ల మార్గానికి రంగులు వేయించారు. ఆలయంలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ విద్యుద్దీకరణ చేపట్టారు. కళ్యాణ వేదిక ను అలంకరించారు.భక్తులు వేచివుండేందుకు తాత్కలికంగా భారీ రేకుల షెడ్లు ఏర్పాటు చేసారు.ఆలయ ప్రాంగణమంతా క్లాత్ డెకరేషన్‌తో అందముగా ముస్తాబు చేసారు. సర్వ దర్శనంతో పాటు స్పెషల్ దర్శనంకు రూ.50ల చొప్పున టికెట్ ధరలు నిర్ణయించారు.

ఏర్పాట్లు పూర్తి

వెంకన్న కల్యాణోత్సవాలకు సంబంధించి టిటిడి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని వెల్లడించారు.

పటిష్ట బందోబస్తు : ఎస్‌పి



ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటున్న ఎస్‌పి మురళీకృష్ణ

ఉపమాక వెంకన్న వార్షిక తిరు కళ్యాణోత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌పి మురళీకృష్ణ తెలిపారు. వెంకన్న ఆలయాన్నిఎస్ పి సందర్శించారు. కళ్యాణోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడికక్కడ స్టాపర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ఆర్ఆర్ మోహన్, సిఐలు విజయకుమార్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్

ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన వడ్డాది శ్రీవెంకటేశ్వర స్వామి 151వ వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఈనెల 20 నుండి 25వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 19న మంగళవారం రాత్రి స్వామి వారి దొంగపెళ్లితో ప్రారంభమై 25వ తేదీ పుష్పాంజలితో ముగుస్తాయి. ఇందులో భాగంగా బుధవారం ఏకాదశి రోజున ప్రత్యేక పూజలు, తిరువీధి, కళ్యాణ మహోత్సవం, 26న తిరువీదోత్సవం, 24న ఆదివారం నాగవల్లి తిరువసంతోత్సవం, చక్రస్నానం నిర్వహిస్తారు. ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ వైకుంఠ ఏకాదశికి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామికి ఇక్కడ కల్యాణ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ధర్మకర్త దొండా కన్నబాబు, కార్యనిర్వహణాధికారి శర్మ తెలిపారు. భక్తులు క్యూలైన్లో వెళ్లేందుకు బారికేడ్లు, పోలీసు బందోబస్తు, వైద్య శిబిరము, తాగునీరు, ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.



వెంకన్న ఆలయం (ఇన్‌సెట్‌లో ఆలయ ధర్మకర్త కన్నబాబు

చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిపి

- సత్యనారాయణపురంలో దొంగతనానికి యత్నం
- అడ్డుకున్న యువకుడిపై రాడ్లతో దాడి
- చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న భరద్వాజ్
- విశాఖలో ప్రయివేటు ఆస్పత్రికి తరలింపు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన విశాఖ సిపి
- గ్యాంగ్‌ను పట్టుకోవడానికి ఆరు బృందాలు ఏర్పాటు
- క్లూస్ టీమ్, పోలీస్ డాగ్‌తో ఆధారాల సేకరణ

ప్రజాశక్తి - డెంకాడ:

మండలంలోని చింతలవలస ఐదో బెటాలియన్ మెయిన్ గేట్‌కి ఎదురుగా ఉన్న సత్యనారాయణపురంలో ఆదివారం అర్ధరాత్రి చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్ చేసింది. ఒక ఇంట్లోకి ప్రవేశించి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసింది. రూమ్‌లో నిద్రిస్తున్న భార్యాభర్తలను భయపెట్టి వారి వద్ద ఉన్న నగలను దోచుకోవడానికి ప్రయత్నించింది. ఈ సమయంలో వారు కేకలు వేయడంతో భర్తను రాడ్లతో కొట్టి పరారయ్యారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం..

సత్యనారాయణపురానికి చెందిన యారపాటి రమణమూర్తి దంపతులకు లక్ష్మీభరద్వాజ్ అనే కుమారుడు ఉన్నాడు. భరద్వాజ్‌కు ఏడాది క్రితం పెళ్లయింది. కుమారుడు, కోడలు ఒక గదిలో నిద్రిస్తుండగా, మరో గదిలో ఇంటి యజమాని రమణమూర్తి, తన భార్య నిద్రిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటల సమయంలో వీరి ఇంట్లో నలుగురి గ్యాంగ్ చొరబడింది. ఇద్దరు బయట ఉండగా, మరో ఇద్దరు ప్రధాన ద్వారానికి మిషన్‌తో రంధ్రం పెట్టి లోపలి గడియను తొలగించారు. అనంతరం ఇంట్లోకి ప్రవేశించి భరద్వాజ్ దంపతులు నిద్రిస్తున్న రూమ్‌లోకి వెళ్లారు. అలజడి కావడంతో కోడలికి మెలకువ వచ్చింది. వెంటనే పక్కనే ఉన్న భర్తకు చెప్పింది. భర్త నిద్ర లేచి దొంగలను చేసి కేకలు వేయడంతో వారి వద్ద ఉన్న రాడ్లతో భరద్వాజ్ తలపై తీవ్రంగా కొట్టారు. ఇంతలో ఎదురుగదిలో నిద్రిస్తున్న తండ్రి రమణమూర్తి, తల్లి లేచి కరెంటు సమస్యో ఏమో అనుకుని మీటర్ స్విచ్ ఆఫ్ చేశారు. ఈ చీకట్లో దొంగలు బయటకు వెళ్లిపోయి, మళ్లీ లోపలికి వచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు నలుగురూ కేకలు వేయడంతో స్థానికులు వచ్చేసరికి దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. అయితే వస్తువులేవీ చోరీకి గురికాలేదు.

అంతా ప్లాన్ ప్రకారమే..

ముందుగా గ్యాంగ్ ప్లాన్ ప్రకారం ఇంటికి రావడానికి ఇనుప కంచె కట్టర్‌తో కట్ చేసి ముందుగా తోవ ఏర్పాటు చేసుకున్నారు. చుట్టుపక్కల ఉన్న ప్రతి ఇంటి తలుపులకు ముందుగానే దొంగలు బయట గడియలు పెట్టేశారు. అనంతరం ఇంట్లోకి దొంగతనానికి ప్రవేశించి అడ్డు వచ్చిన భరద్వాజ్‌పై దాడి చేశారు. గాయాలపాలైన భరద్వాజ్ స్పృహ కోల్పోవడంతో వెంటనే కుటుంబ సభ్యులు విశాఖపట్నంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది. ఇలాంటి దొంగతనం ఈ ప్రాంతంలో తొలిసారి జరగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

సిపి రవిశంకర్ పరిశీలన

ఈ గ్రామం పద్మనాభం మండలం, విశాఖపట్నం అర్బన్‌లో ఉంది. దీంతో సంఘటనా స్థలాన్ని విశాఖపట్నం సిపి రవిశంకర్, జాయింట్ కమిషనర్ పకీరప్ప, డిసిపి-1 విజయ మణికంఠ, క్రైమ్ డిసిపి వెంకటరత్నం.. సోమవారం ఉదయం పరిశీలించారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్ వచ్చి ఆధారాలను సేకరించింది. దొంగతనం గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

ఆరు బృందాలు ఏర్పాటు

దొంగలను పట్టుకునేందుకు ఆరుగురు సిఐల ఆధ్వర్యంలో ఆరు బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో రామభద్రపురంలో రెండు రోజుల క్రితం జరిగిన దొంగతనం... తాజాగా సత్యనారాయణపురం ఘటన ఒకే మాదిరిగా ఉన్నాయని, ఈ రెండు చోరీలకు ప్రయత్నించిన వారు ఒకే గ్యాంగ్ అని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఇది చెడ్డీగ్యాంగ్ పనేనని పోలీసులు తెలిపారు. ఒకప్పుడు ఇంట్లో ఎవరూ లేకపోతే దొంగతనాలు జరిగేవని ఇప్పుడు ఇంట్లో మనుషులున్నా దొంగలు ప్రవేశించి అడ్డొస్తే వారిపై దాడి చేసి దొంగతనాలకు పాల్పడడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసు బెటాలియన్‌కు కూతవేటు దూరంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి కుటుంబ సభ్యులను కొట్టి దొంగతనానికి పాల్పడడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో పోలీస్ గస్తీ ఉండేదని, ఇప్పుడు అటువంటిదేమీ కనబడకపోవడంతోనే ఇటువంటి దొంగతనాలు జరుగుతున్నాయని, పోలీసు గస్తీని పెంచాలని పలువురు కోరుతున్నారు.